TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :153 prajadivvs57@gmail. com గురువారం 23 ఏప్రిల్ 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

## దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

- ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు
- ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన



ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు.వివిధ రంగాలలో మిగతా2లో...

## ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు

- వివరణ కోరిన కేంద్ర ఎన్నికల సంఘం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'టెర్రరిస్టు' అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసు పంపింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నందున ఆయనపై చర్య తీసుకోవాలని, మిగతా2లో...

## కాళేశ్వరం కథ ముగియలేదు

● సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు ● బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో..? ● మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



: కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు మిగతా2లో...



## నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

- 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- బెంగాల్లో 152 స్థానాలకు తొలి విడత పోలింగ్ ఏర్పాట్లు

: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అలాగే బెంగాల్లో తొలిదశ పోలింగ్ జరుగనుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది సరంజామాతో తమకు అప్పగించిన కేంద్రాలకు చేరుకున్నారు. తమిళనాట మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మిగతా2లో...

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్



కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం మిగతా2లో...

## కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలొద్దు
- సీబీఐ దర్యాప్తు కూడా చేయొద్దు
- కాళేశ్వరంపై హైకోర్టు కీలక తీర్పు



కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని తేల్చి చెప్పింది. అలాగే ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను కలిపి ఉమ్మడిగా తీర్పు వెలువరించింది. పిటిషనర్లపై కమిషన్ నివేదిక ఆధారంగా మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

- ములుగు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షం




తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు , వడగళ్ల వాన తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా తెలంగాణలోని ములుగు, ఏపీలోని నంద్యాల జిల్లాలో కురిసిన వానకు సామాన్య ప్రజలతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో మిగతా2లో...

## రెండు రాష్ట్రాల్లో భారీగా నగదు, మద్యం, నగలు పట్టివేత

- దాదాపు వేయికోట్ల విలు వుంటుందని ఇసి వెల్లడి



ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ధనం, మద్యం, ఉచితాలతో ఓటర్లను ప్రలోభపెడుతుండటం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ప్రలోభాలపై ఈసీ దేగకన్ను వేస్తుంటుంది. తాజాగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1,000 కోట్లకు పైగా విలువచేసే నగదు, మద్యం, డ్రగ్స్, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మిగతా2లో...



## ఆరుగురు ఐపిఎస్‌లకు డిజి హోదా

తెలంగాణలో పని చేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీ ఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీ ఎస్ బ్యాచ్‌కు చెంది న మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్ కు చెందిన చారుసిన్హా, అనిల్‌కు మార్, సజ్జనార్‌కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## 'ఓటుకు నోటు'ను క్రిమినల్ కేసుగా పరిగణించొద్దు

- సుప్రీంను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్నికల చట్టాల ప్రకారం విచారించాలని విన్నపం
- తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా



ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఈ కేసును క్రిమినల్ కేసుగా పరిగణించవద్దని ప్రధాన నిందితుడైన సీఎం రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు మంగళవారం సుప్రీంకోర్టును కోరారు. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల కింద విచారించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో రేవంత్‌రెడ్డి పిటిషన్‌తోపాటు ఇదే కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ మరో నిందితుడు సండ్ర వెంకటవీరయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై రెండు వారాల తర్వాత విచారణ మిగతా2లో...

## ఆర్టీసీ సమ్మె బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి



చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా మిగతా2లో...

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందిగా ఆదేశించాలని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈసీకి బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే వివరణ కోరుతూ ఎన్నికల కమిషన్ నోటీసు ఇచ్చింది. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని బీజేపీ ప్రతినిధుల బృందంలోని నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈసీకి ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో పాటు భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 175 కింద నేరమవుతుందని, పరువునష్టం కేసు వేసేందుకు అవసరమైన ప్రాథమిక సాక్ష్యంగా ఆయన వ్యాఖ్యలు నిలుస్తాయని ఈసీ దృష్టికి తెచ్చారు. అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై ఖర్గే తమిళనాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందని ప్రశ్నించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని విమర్శించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించడంతో ఆయన తిరిగి వివరణ ఇచ్చారు. మోదీని తాను ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదని, ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. మీడియాతో కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ఈసీఐని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కలిసినట్టు చెప్పారు. ఎంతో బాధ, ఆగ్రహంతో తాము ఇక్కడకు వచ్చామన్నారు. ప్రధానమంత్రి మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అవమానించిన తీరే ఇందుకు కారణమని అన్నారు. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. దీనికి ముందు, ఖర్గే వ్యాఖ్యల వివాదంపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఒక లేఖ రాసింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం కిందకు వస్తుందని పేర్కొంది.

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. కొత్తగా సినీనటుడు విజయ్ టీవీకే పార్టీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతానని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచారు. పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది. 2021 నాటి పరిస్థితులకు భిన్నంగా ఈసారి తృణమూల్, భాజపాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. విజయం నల్లేరు మీద నడకలా కనిపించడం లేదు.

# కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

సీబీఐ దర్యాప్తుతో పాటు ఇతర చర్యలేవీ తీసుకోరాదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చట్టబద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కమిషన్ విచారణ తీరు చట్టబద్ధంగా లేదని తేల్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే...పిటిషనర్లు కేసీఆర్, హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషిలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గత ఏడాది జులై 31న ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు చేయరాదని హైకోర్టు గతేడాది సెప్టెంబర్ 2న మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. బుధవారం వెలువడిన తీర్పు ప్రకారం మధ్యంతర ఉత్తర్వులు తుది ఉత్తర్వుల య్యాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు గురైందని చెప్పి ప్రభుత్వం జస్టిస్ ఘోష్ కమిషన్‌తో విచారణకు ఆదేశించడం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ఉందని వెల్లడించింది. ఈ క్రమంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిజనిర్ధారణ మాత్రమే చేయాలనీ, ఎవరు తప్పు చేశారో చెబుతూ వాళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనే ధోరణిలో నివేదిక ఇవ్వడాన్ని ఆక్షేపించింది. కమిషన్ విచారణ సమయంలో సాక్షులు ఇచ్చిన సమాచారాన్ని, ఆధారాలను పరిశీలించాక ఎవరిపైన అయినా అభియోగాలు ఉన్నాయని భావిస్తే.. సదరు సాక్షికి ఆ వివరాలు, అభియోగాలు తెలియజేసి వివరణ తీసుకోవాలన్న కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి), 8(సి) సెక్షన్ల నిబంధనలను అమలు చేయలేదని తప్పుపట్టింది. కమిషన్ ఈ ఏడాది జులై 31న ఇచ్చిన రిపోర్టుతో సంబంధం లేకుండా సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తున్నామని ప్రభుత్వం చెబుతూనే రిపోర్టులోని అంశాలను సీబీఐ దర్యాప్తు కోరుతూ వెలువరించిన నోటిఫికేషన్‌లో ప్రస్తావించడాన్ని తప్పుపట్టింది. తీర్పు ప్రతి ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. బెంచ్‌పై చీఫ్ జస్టిస్ మూడు వ్యాఖ్యల తీర్పు సారాంశాన్ని వెలువరించారు. పిటిషన్లను పాక్షికంగా అనుమతిస్తున్నట్టు ప్రకటించారు.

**కాళేశ్వరంపై హైకోర్టు ఎవరికి క్లీన్ చిట్ ఇవ్వలేదు సీబీఐ విచారణకు కోర్టు తీర్పు అడ్డంకి కాదు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి** కాళేశ్వరంపై హైకోర్టు ఎవరికి క్లీన్ చిట్ ఇవ్వలేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. "జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కొట్టేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కానీ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదు. కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించింది. జ్యుడీషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. బుధవారం వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదు" అని ఉత్తమ్ పేర్కొన్నారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తరువాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



# కాళేశ్వరం కథ ముగియలేదు

(మొదటి పేజీ తరువాయి)

తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమీషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్‌ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# రెండు రాష్ట్రాల్లో భారీగా నగదు మద్యం, నగలు పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమబెంగాల్‌లో రూ.472.89 కోట్లు, తమిళనాడులో రూ.599 కోట్లు విలువచేసే నగదు, మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, ఉచితాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. ఇందులో రూ.127.67 కోట్ల నగదు, రూ.106.3 కోట్ల విలువైన మద్యం, రూ.184.83 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.215.19 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.437.97 కోట్ల విలువైన ఇతర ఉచితాలు ఉన్నట్టు ఈసీ తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 23న జరుగనుంది. తమిళనాడులో ఒక విడతలో పోలింగ్ జరుగనుండగా, బెంగాల్‌లో రెండు విడతలుగా జరుగునుంది. అక్కడ రెండో విడత పోలింగ్ ఈనెల 29న ఉంటుంది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో పాటు ఇప్పటికే పోలింగ్ పూర్తయిన అస్సాం, కేరళ, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

# 'ఓటుకు నోటు'ను క్రిమినల్ కేసుగా పరిగణించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

జరుపనున్నట్టు జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ప్రకటించింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఇదేవిధమైన మరో కేసుపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాల్సి ఉన్నదని, ఆ తీర్పు వచ్చాక అందులోని వివరాలను పరిశీలించి 'ఓటుకు నోటు' కేసును విచారిస్తామని తెలిపింది.

# తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

కూడిన వడగళ్ల వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో భారీగా వడగళ్ల వాన కురిసింది. గాలుల ధాటికి పలు గ్రామాల్లో ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ప్రజలు భయంభ్రాంతులకు గురయ్యారు. ఏటూరునాగారం – కమలాపూర్ మార్గంలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేతికి వచ్చే దశలో ఉన్న మిర్చి, వరి పంటలు వడగళ్ల వానకు దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నంద్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలివాన ధాటికి వందల ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలపాలు కావడంతో రైతులు భారీగా నష్టపోయారు. రుద్రవరం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నేలకూలిన విద్యుత్ తీగలు, స్తంభాలతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. వాటిని తాకవద్దని అధికారులు సూచించారు. పంట నష్టపోయిన రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలిపాలని, ప్రభుత్వం నుంచి అందే సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. రాబోయే కొన్ని గంటల్లో మళ్లీ వర్ష సూచన ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

# నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును వేగంగా ఢీకొన్న కారు: ముగ్గురు దుర్మరణం




నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు.. బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శాకాజిపురానికి చెందిన బాల్‌రెడ్డి, అలివేలు, పాల్వాయి గ్రామానికి చెందిన మంజుల, వెంకటమ్మ నల్గొండలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వద్దిరెడ్డిగూడెం సమీపంలో అతి వేగం కారణంగా కారు ప్రమాదానికి గురైంది. ఓ బైకును ఢీకొట్టి కారు అదుపుతప్పింది. ఆ వెంటనే ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కనగల్‌కు చెందిన మధుబాబు, ధనుంజయ అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఉన్న బాల్‌రెడ్డి కూడా సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికులు ప్రమాదం గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రధాని మోదీపై కార్గే చేసిన వ్యాఖ్యలుఉపసంహరించుకోవాలి

**-బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి డిమాండ్**





**ముస్తాబాద్/ ఏప్రిల్ 22 ప్రజా దివాస్** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీ పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ముస్తాబాద్ మండల బీజేపీ నాయకులు బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, తమిళనాడు ఎన్నికల సందర్భంలో బీజేపీపై విమర్శలు చేస్తూ ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అనుచిత పదజాలం ఉపయోగించారని విమర్శించారు.దేశ ప్రజల మద్దతుతో వరుసగా మూడుసార్లు ప్రధాన మంత్రిగా ఎన్నికైన నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు ఇటీవల బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపించారు.ఖర్గే వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి, చిట్నీని శ్రీనివాస్ రావు, చికోటి మహేష్, దీటి సత్తయ్య, పున్నం అనిల్, ఒరగంటి సత్యం తదితరులు పాల్గొన్నారు

# సనుగుల పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్







**చందుర్తి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 22** చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ (స్కూల్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భం ా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్నూరు కాపు కళ్యాణ మండపం ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 22** వేములవాడలో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు కళ్యాణ మండపాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ కు సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, “కులం అంటే బలం, బలగం” అని పేర్కొన్నారు. ఈ మండప నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినంది ంచారు. అలాగే ఈ కళ్యాణ మండపం నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మున్నూరు కాపు ఐక్యతకు తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్,సత్రం అధ్యక్షులు కోయినేని బాలయ్య, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యతో పాటు సంఘం సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.









# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు









**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 22** వేములవాడ అర్బన్ మండలం మారుపాక చంద్రగిరి, సంకెపెల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు దైత కుమార్, ఖమ్మం గణేష్, కత్తి కనకయ్య, విద్యాసాగర్, అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లి కనకయ్య, మరియు ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# సిరిసిల్ల జిల్లా టీజీ డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

**- టీజీజీడీఏ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నాగార్జున చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సంతోష్ చారి**

**- ఏకగ్రీవంగా ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నిక: కోశాధికారిగా డాక్టర్ సంతోష్ కుమార్**

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 22** తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఎ) రాజన్న సిరిసిల్ల జిల్లా యూనిట్ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనస్థీషియా విభాగం ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ నాగార్జున చక్రవర్తి జిల్లా అధ్యక్షుడిగా, వేములవాడ ఏరియా ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కే సంతోష్ చారి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. కోశాధికారిగా సిరిసిల్ల మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ జై కాశీనాథ్, డాక్టర్ ఎస్ దీప్తి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఏ సాధన, డాక్టర్ జే నాగన్న, డాక్టర్ ఈ బాబు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ కే అరుణ్, డాక్టర్ పి పరమేష్, డాక్టర్ పి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు డాక్టర్




సుమన్ రావు, మోహన్ రావు వెల్లడించారు. కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ జె మనీష్, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ జిందం రేఖ, డాక్టర్ ధనరాజు, డాక్టర్ పి క్రాంతి కుమార్, హనుమాజీపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి దివ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లాలోని ప్రభుత్వ వైద్యులందరూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ధాత్రి దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు



**ముస్తాబాద్/ ఏప్రిల్ 22 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవును గ్రామంలో ధాత్రి దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవునూరు విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామం సర్పంచ్ నక్క దాసరి రవి ఆధ్వర్యంలో గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడం మనోహర్ ఆవునూరు గ్రామ సర్పంచ్ నక్క దాసరి రవి, ఉపసర్పంచ్ నక్కల రాజు, మరియు పాలకవర్గం మరియు గ్రామస్తులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నాయకులు







**ముస్తాబాద్/ ఏప్రిల్ 22 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముస్తాబాద్ పరిధిలోని ముస్తాబాద్, మొరయిపల్లె, చిప్పలపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పోతుగల్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ తలారి రాణి నర్సింలు ముస్తాబాద్ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మొరయిపల్లె సర్పంచ్ మెంగని శ్రీనివాస్, చిప్పలపల్లి సర్పంచ్ మాచెట్టి లచ్చయ్య సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి ఆయా గ్రామాల ఉపసర్పంచ్ లు వార్డు సభ్యులు రైతులు పలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఉచిత సంతాన సఫాల్యత శిబిరం పీపుల్స్ హాస్పిటల్ ముస్తాబాద్




**ముస్తాబాద్/ ఏప్రిల్ 22 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల పరిసర ప్రాంతాల ప్రజలకు శుభవార్త సంతానం లేని మరియు రెండవ సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు ఇప్పుడు ముస్తాబాద్ లోని డాక్టర్ బ్రహ్మయ్య మెమోరియల్ పీపుల్స్ హాస్పిటల్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఈ వి ఏ. ఐ వి ఎఫ్ వారి ఉచిత క్యాంప్ శిబిరం తేదీ 27/4/2026 సోమవారం రోజున ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ శంకర్ తెలిపారు ఈ క్యాంపులో ఉచిత రిజిస్ట్రేషన్ ఉచిత సెమాన్ ఎనాల్సిలిన్ ఉచిత త్రీ డి స్కానింగ్ ఉచిత వైరల్ మార్కు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని సంతానం లేని దంపతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముందస్తు రిజిస్ట్రేషన్ కొరకు 8374849234. లేదా9392944482. సంప్రదించాలని సూచించారు

# కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు 'కక్ష సాధింపు' రాజకీయాలకు చెంపపెట్టు

**: దాస్యం భాస్కర్**

**హన్మకొండలో బీఆర్ఎస్ శ్రేణుల భారీ సంబరాలు..**

**కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం**

**కాంగ్రెస్ కుట్రలు పటాపంచలయ్యాయి: మాజీ చీఫ్ విప్**

**చౌరస్తాలో మిఠాయిల పంపిణీ, బాణసంచా పేల్చిన గులాబీ శ్రేణులు**





**ప్రజాదివాస్ ఏప్రిల్ 22 ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 22**
కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన విచారణ కమిషన్‌పై తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తూ హన్మకొండలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మిన్నంటేలా సంబరాలు నిర్వహించాయి. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం భాస్కర్ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు హన్మకొండ చౌరస్తా వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.రాజకీయ వేధింపులే లక్ష్యంఈ సందర్భంగా దాస్యం భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్దదైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారని గుర్తుచేశారు. కేసీఆర్ కి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక, ఆయనను రాజకీయంగా అభాసుపాలు చేయాలనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్లను అడ్డుపెట్టుకుని కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు.న్యాయమే గెలిచింది"హైకోర్టు తాజా తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ కక్షపూరిత ధోరణికి చెంపపెట్టు. ప్రభుత్వం వేసిన ఈ కమిషన్ అంతా 'ట్రాష్' అని తేలిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారని కోర్టు తీర్పుతో స్పష్టమైంది" అని దాస్యం భాస్కర్ వ్యాఖ్యానించారు.తెలంగాణ ప్రజల విజయంఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తుందని ఈ తీర్పు నిరూపించిందని ఆయన అన్నారు. కేసీఆర్ ని బదనాం చేయాలనుకున్న కాంగ్రెస్ నాయకుల కుయుక్తులు పటాపంచలు అయ్యాయని, ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ధరిత్రిని కాపాడుకుందాం.. పచ్చని భవిష్యత్తును ఇద్దాం

**: కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**'మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్' పోస్టర్ ఆవిష్కరణ.. 15 రోజుల పాటు పర్యావరణ సంరక్షణ వేడుకలు**

**ఏక వినియోగ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి**

**మొక్కలు నాటడం, సైకిల్ ర్యాలీలతో అవగాహన కల్పించాలని పిలుపు**



**ప్రజాదివాస్ ఏప్రిల్ 22ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 22**
మనం నివసిస్తున్న భూమిని, పర్యావరణాన్ని కాపాడుకోవడం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుని ప్రాథమిక కర్తవ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ మరియు కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన "ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15--30)" అవగాహన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.పర్యావరణ స్పృహ ప్రతి పనిలో ఉండాలిఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, భూతాపం మానవాళికి పెను సవాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఏప్రిల్ 15 నుండి 30 వరకు నిర్వహిస్తున్న ఈ పక్షం రోజుల వేడుకల్లో భాగంగా విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కలెక్టర్ సూచించిన కీలక అంశాలు:ప్లాస్టిక్ రహిత సమాజం: అత్యంత ప్రమాదకరమైన ఏక వినియోగ (సింగిల్-యూజ్) ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించి, గుడ్డ సంచుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలి.హరితహారం: ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడమేకాకుండా, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలి.ఆరోగ్యకర జీవనం: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీలు, మార్నింగ్ వాక్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. సేంద్రియ పద్ధతులు: రసాయన రహిత సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.పాల్గొన్న అధికారులుఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (ఇంచార్జ్) ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపాలని అధికారులు ఈ సందర్భంగా ప్రతిన పూనారు.

# నరేష్ అనే వికలాంగుడిని పరుష పదజాలంతో దూషించిన ఎమ్మెల్యే అయిలయ్య బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

**- విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్**



**ప్రజాదివాస్ ఏప్రిల్ 22 సూర్య:.** నరేష్ అనే వికలాంగుడిని పరుష పదజాలంతో దూషించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో వికలాంగుల భవనంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భువనగిరి యాదాద్రి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కొనదెల నరేష్ వికలాంగులకు మూడు చక్రాల స్కూటీలు అందజేయాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయలేను ఎమ్మెల్యే కార్యాలయంలో అడగగా, వెంటనే ఆగ్రహానికి గురైన తన సొంత పార్టీ నాయకుడని చూడకుండా నరేష్ అనే వికలాంగుడు ని బూతు మాటలతో తిట్టి అవమానించారు. పెండింగ్లో ఉన్న స్కూటీలను పంపిణీ చేయాలని చేయకపోతే కాంగ్రెస్ పార్టీ పరువు పోతుందని స్కూటీలు వచ్చిన తర్వాత నిర్లక్ష్యం ఎందుకు చేద్దామని, వికలాంగు లపై ఎంత గౌరవం ఉందో గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు, అధికార పార్టీలో ఉండి ప్రజలకు సేవలు చేయాల్సింది పోయి వికలాంగులను అవమానించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ రాష్ట్ర పిసిసి అధ్యక్షులను మహేష్ కుమార్ గౌడ్ కలుస్తామ న్నారు. ఆయన ఎమ్మెల్యే కార్యాలయంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని ఎడల, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి, జిల్లా అధ్యక్షులు

# అనిల్ యాదవ్ నూతన గృహప్రవేశానికి గ్రంథాలయ పాలకవర్గం హాజరు

**ఇందిరమ్మ ఇల్లు మంజూరు నేపథ్యంలో ఘనంగా గృహప్రవేశం**

**షాద్ నగర్ ప్రజాదివాస్ ఏప్రిల్ 22 జోన్ ఇంచార్జ్:** షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయ పాలకవర్గం సభ్యులు బుధవారం ఫరూక్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామంలో నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామానికి చెందిన గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ అనిల్ కుమార్ యాదవ్ కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగా, నిర్మాణం పూర్తయిన ఈ గృహాన్ని శుభముహూర్తంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ నక్క



బాలరాజ్, ప్రధాన కార్యదర్శి క్యా సెట్ శ్రీనివాస్, ఆర్గనైజర్ మరియు మీడియా ఇంచార్జ్ అల్వాల దర్శన్ గౌడ్, డైరెక్టర్ శివరాం యాదవ్, రిపోర్టర్ ఏ. మల్లేష్ యాదవ్, తదితరులు హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, అనిల్ యాదవ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

# ట్రాఫిక్ పోలీసులకు 'చలువ' దీవెన: ఎండ తీవ్రత దృష్ట్యా అద్దాల పంపిణీ

**శరత్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ట్రాఫిక్ సిబ్బందికి రక్షణ**

**ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం: అదనపు డీసీపీ ప్రభాకర్ రావు**

**విధుల పట్ల అంకితభావం ఉన్న సిబ్బందికి అండగా స్వచ్ఛంద సంస్థలు**



**ప్రజాదివాస్ ఏప్రిల్ 22ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 22**
మండుతున్న ఎండలను లెక్కచేయకుండా రహదారుల పై నిలబడి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడడంలో భాగంగా హనుమకొండలో ఒక మంచి కార్యక్రమం జరిగింది. స్థానిక శరత్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందికి చలువ అద్దాలను పంపిణీ చేశారు.

**సిబ్బంది ఆరోగ్యమే ప్రాధాన్యం:**
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు తన చేతుల మీదుగా సిబ్బందికి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కఠినమైన వేసవిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అనేది సవాలు తో కూడుకున్న పని. ఎండ ప్రభావం వల్ల కంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సిబ్బంది విధి నిర్వహణలో తమ ఆరోగ్య పరిరక్షణ పట్ల కూడా జాగ్రత్త వహించాలి" అని సూచించారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన శరత్ కంటి ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి సీతా రెడ్డి గారు, శరత్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న తరుణంలో ఇలాంటి రక్షణ పరికరాలను అందజేయడం పట్ల ట్రాఫిక్ కానిస్టేబుళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నూతన గృహప్రవేశంలో సంప్రదాయం మెరిపించిన వేడుక

**- అనిల్ యాదవ్ ఇంటి గృహప్రవేశంలో నూతన వస్త్రాల పంపిణీ -**

**- హిందూ సాంప్రదాయానికి ప్రతీక**



**షాద్ నగర్ ప్రజాదివాస్ ఏప్రిల్ 22జోన్ ఇంచార్జ్:**
ఫరూక్ నగర్ మండలం గంట్లవెల్లి గ్రామం ఏ.అనిల్ యాదవ్ నూతన గృహప్రవేశం సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్ జర్నలిస్టు అల్వాల దర్శన్ గౌడ్ పాల్గొని, అనిల్ యాదవ్ దంపతులకు మరియు వారి కూతుర్లకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కూతుర్లకు మెడలో టవల్ వేసి ఆశీర్వదించడం హిందూ సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచింది.నూతన గృహప్రవేశ వేడుకల్లో వస్త్రాల అందజేయడం వంటి సంప్రదాయాలు కుటుంబ బంధాలను, బలపరచడంలో,,మరియు స్నేహానికి ముఖ్య పాత్ర పోషిస్తాయని పాల్గొన్న వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నడికుడ రఘునాథ్ యాదవ్ గ్రంథాలయ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త సురేష్ టిఆర్ఎస్ నాయకులు నడికుడి అశోక్ యాదవ్ గ్రంథాలయం గ్రంథాలయం డైరెక్టర్ వీపిరి శివరాములు యాదవ్ పద్మారం వెంకటేష్ జర్నలిస్టు దోర్న ప్రవీణ్ యాదవ్ యాదవ సంఘం యువ నాయకులు రఘు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష



**మిర్యాలగూడ ప్రజాదివాస్ ఏప్రిల్ 22**మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో బుధవారం 2 వ అడిషనల్ జ్యుడీషల్ మేజిస్ట్రేట్ అరుణ్ తేజ్ మిర్యాలగూడ 10,000/- జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పడం జరిగింది. జరిమానా కట్టకపోతే జైలు శిక్ష వేయడం జరిగింది అని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు జైలు శిక్ష పడ్డ వ్యక్తులు పిడుగురాళ్ల కు చెందిన పేర్ల శ్రీను s/o వీరయ్య కు 3 రోజుల జైలు శిక్ష, అలాగే వెంకటాద్రిపాలెం కు చెందిన మాలోతు మంగ్యా s/o తావుర్య కు 7 రోజుల జైలు శిక్షను విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది